ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 16 ఆగస్టు 2024



మధ్యతరగతి వారికోసం

ముదల్వర్ మరుందగం

మాజీ సైనికుల కోసం 'కాక్కుమ్‌కరంగళ్' ● సమరయోధుల పించను పెంపు ● స్వాతంత్ర్యదినోత్సవ సభలో సీఎం స్టాలిన్ వరాలు

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీపీ, షుగర్ వంటి వ్యాధులకు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందే మధ్యతరగతి వర్గాల ప్రజలకు తక్కువ ధరలకే కీలకమైన మందులు లభించేలా 'ముదల్వర్ మరుందగం' అనే పథకాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. గురువారం సెయింట్ జార్జికోట ప్రాంగణంలో అట్టహాసంగా జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, రాష్ట్ర ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ముదల్వర్ మరుందగం పథకం కింద ప్రైవేటు ఆస్పత్రుల్లో మధుమేహం, రక్తపీడనం వంటి రోగాలకు చికిత్స పొందుతూ, అధిక ధరలతో కూడిన మందులు కొనలేని స్థితిలో కొట్టుమిట్టాడే మధ్యతరగతి ప్రజలకోసం జెనరిక్ మందులతోపాటు, ఇతర రకాల మందులను తక్కువ ధరలతో విక్రయించేలా ముదల్వర్ మరుందగం పేరుతో తొలి విడతగా 1000 మందుల దుకాణాలను ప్రారంభిస్తామన్నారు. వచ్చే యేడాది సంక్రాంతి రోజున సీఎం మందులషాపులు ప్రారంభమవుతాయన్నారు. ఈ పథకాన్ని నిర్వర్తించడంలో కీలక పాత్ర పోషించే ఫార్మసిస్టులు, సహకార సంఘాల అవసరమైన రుణ సదుపాయాలతోపాటు రూ.3లక్షల వరకు సబ్సిడీ కూడా ఇస్తామని ఆయన తెలిపారు.

'ముదల్వరిన్ కాక్కుమ్‌కరంగళ్'

జన్మభూమి కోసం యుక్తవయస్సును త్యాగం చేసే మాజీ సైనికుల జీవనాధారాన్ని పెంచేలా 'ముదల్వరిన్ కాక్కుమ్‌కరంగళ్' పేరుతో వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టనున్నామని స్టాలిన్ తెలిపారు. ఈ పథకం కింద మాజీ సైనికులు పరిశ్రమలు ప్రారంభించేందుకు రూ.కోటి వరకు బ్యాంకుల ద్వారా రుణం కల్పిస్తామన్నారు. ఈ పథకం ద్వారా ప్రారంభించే పరిశ్రమలకు రుణంలో 30 శాతం మూలధన సబ్సిడీ, 3 శాతం వడ్డీ సబ్సిడీ ఇస్తామని తెలిపారు. వీరికి ప్రతిభాపాటవాల పెంపు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వమే సునిశిత శిక్షణను కూడా అందిస్తుందని తెలిపారు. వచ్చే రెండేళ్లలో 400 మంది మాజీ సైనికులు లబ్ధి పొందేలా రూ.400 కోట్ల మేరకు రుణసదుపాయాలను అందించనున్నామని ఆయన పేర్కొన్నారు.

సమరయోధుల పింఛను పెంపు

స్వాతంత్ర్య సమరయోధులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న నెలవారి పింఛన్‌ను రూ.20వేల నుండి రూ.21వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇదే విధంగా సమరయోధుల కుటుంబాలకు ఇచ్చే నెలసరి కుటుంబ పింఛన్ రూ.11వేల నుంచి రూ.11500లకు పెంచుతున్నట్లు తెలిపారు. వీరపాండ్యకట్ట బ్రహ్మన, శివగంగ మరుదు సోదరులు, రామనాథపురం సంస్థానాధీశులు ముత్తురామలింగ విజయరఘునాథ సేతుపతి, వావు చిదంబరనార్ తదితర సమరయోధుల వారసులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక పింఛన్‌ను కూడా రూ.10వేల నుంచి రూ.10,500లకు పెంచుతున్నట్లు తెలిపారు.

కొండప్రాంతాల పటిష్ఠతపై నిపుణుల కమిటీ...



ఓపెన్‌టాప్ జీపుపై నుంచి పోలీసుల కవాతు వీక్షిస్తున్న స్టాలిన్

ఇటీవల కేరళలోని వయనాడులో సంభవించిన దుర్ఘటన రాష్ట్రంలోని నీలగిరి, వాల్పారై, కొడైకెనాల్ వంటి కొండ ప్రాంతాల్లో జరిగే అవకాశాలున్నాయా అని పరిశీలించేందుకు ప్రత్యేకంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయనున్నామని స్టాలిన్ ప్రకటించారు. అటవీశాఖ, భౌగోళిక శాఖ, గృహవసతి శాఖ, నగరాభివృద్ధి శాఖ, పర్యావరణ శాఖలకు చెందిన నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. భవిష్యత్తులో ఈ కొండప్రాంతాల్లో ఏర్పడగల పెనుముప్పును ముందుగానే పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేయడానికి ఈ కమిటీ దోహదపడుతుందన్నారు.

డీఎంకే పాలనలో పెరిగిన సమరయోధుల కీర్తి

గత మూడేళ్లగా ద్రావిడతరహా డీఎంకే ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల కీర్తి ప్రతిష్ఠలు భావితరాల వారు తెలుసుకునేలా వారి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తమ ప్రభుత్వం మహిళాభ్యుదయానికి, విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆ మేరకు మహిళ కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందని, వాటిలో గృహిణులకు కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకం, సీటీ, టౌన్ బస్సుల్లో వెలుగుబాట (ఉచిత) ప్రయాణం, విద్యార్థినులకు ప్రతినెలా రూ.1000 చెల్లింపు వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సీఎం అల్పాహార పథకం ద్వారా సుమారు 20.73 లక్షల మంది చిన్నారులు పస్తులకు దూరంగా చదువుకోగలుగుతున్నారని చెప్పారు. ఇటీవలే ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు 'తమిళ్‌పుదల్వన్' పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి నెలా రూ.1000లను చెల్లిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ సమస్యను కూడా సమూలంగా నిర్మూలించేందుకు తమ ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోందని, విద్యార్థులకు ప్రతిభాపాటవాలలో శిక్షణ అందించడం ద్వారా ప్రైవేటు కంపెనీలలో మంచి ఉద్యోగాలు పొందుతున్నారని, ఇదే విధంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న కీలకమైన పోస్టులలోను నియమితులవుతున్నారని చెప్పారు.

పెట్టుబడుల సమీకరణ

రాష్ట్రంలో 2026 జనవరిలోగా ప్రభుత్వ శాఖల్లో 75 వేల పోస్టులను భర్తీ చేయాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. జనవరి 7, 8 తేదీల్లో నగరంలో నిర్వహించిన ప్రపంచ పెట్టుబడి దారుల మహానాడు ద్వారా 6,64,180 కోట్ల మేర పెట్టుబడులు సాధించేలా 631 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ఈ పెట్టుబడుల ద్వారా పరిశ్రమలు ప్రారంభమైతే 14,54,712 మందికి ప్రత్యక్షంగా, 12,35,945 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరిచే దిశగా ఎరయూరులో టెక్నికల్ పార్కు, నందంబాక్కంలో 56 ఎకరాల విస్తీర్ణంలో ఆర్థికనగరం, తిరుచ్చి,మదురైలో కొత్త టైడల్ పార్కులు, విల్లుపురం, తిరుప్పూరు, వేలూరు, తంజావూరు, తూత్తుకుడి, సేలం, శివగంగ జిల్లాల్లో మినీ టైడల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.





సెయింట్ జార్జికోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవవందనం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ముగ్గురికి అత్యున్నత పురస్కారాలు

● విశేష సేవలందించిన వారికి అరుదైన సత్కారం

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా తమిళభాషాభివృద్ధికి విశేష కృషి సల్పిన టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు, తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తండ్రి కుమరి అనంతన్‌కు 'తగైసాల్ తమిళర్' అవార్డును ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. ఇదే విధంగా శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రతిభాపాటవాలు ప్రదర్శించే శాస్త్రవేత్తలకు ఇచ్చే డాక్టర్ అబ్దుల్ కలామ్ అవార్డును చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ వీరముత్తువేల్ అందుకున్నారు. ఇక కేరళలోని వయనాడులో మట్టిపెళ్లలు విరిగిపడిన దుర్ఘటనలో క్షతగాత్రులకు ప్రాణాలకు తెగించి వైద్యసేవలందించిన గూడలూరు నర్సు సబీనాను కల్పనా చావ్లా అవార్డుతో స్టాలిన్ సత్కరించారు. కుమరి అనంతన్ తమిళ సాహితీప్రియుడిగా అందరికీ సుపరచితులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ అనుచరుడిగా పేరుగిడించారు. భారతియార్ రచనలపై పరిశోధన కూడా చేశారు. ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి తమిళంలో ప్రసంగించేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. కుమరి అనంతన్ సాగించిన ఒంటరిపోరాటం ఎట్టకేలకు విజయ సాధించింది. పార్లమెంట్‌లో ఎంపీలు తమిళంలో మాట్లాడేందుకు అనుమతి కూడా లభించింది.

వీరముత్తువేల్...

అబ్దుల్‌కలామ్ అవార్డును స్వీకరించిన పి.వీరముత్తువేల్ ప్రస్తుతం ఇస్రో యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్ చంద్రయాన్ -3 ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. చంద్రుడిపై దక్షిణ ధ్రువంలో ఉపగ్రహాన్ని సవ్యంగా ల్యాండింగ్ కావడంలో కీలకపాత్ర పోషించారు. గతంలో చంద్రయాన్-2 ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా, ఇస్రో ఆధ్వర్యంలో ఐఎన్ఎస్ 1ఎ, ఐఎన్ఎస్-1బి, ఐఎన్ఎస్-1సీ ప్రాజెక్టులకు డైరెక్టర్‌గా సేవలందించారు. మార్స్ ల్యాండింగ్ మిషన్, చంద్రయాన్-4 వంటి భవిష్యత్ ప్రాజెక్టుల రూపకల్పనలోనూ పాలుపంచుకుంటున్నారు.

ధీరవనిత సబీనా..

ధైర్యసాహసాలు ప్రదర్శించే మహిళలకిచ్చే కల్పనా చావ్లా అవార్డును నీలగిరి జిల్లా గూడలూరుకు చెందిన నర్సు ఎ.సబీనా అందుకున్నారు. జూలై 30న కేరళలోని వయనాడు ఉత్పాతంలో తీవ్రంగా గాయపడిన వారికి చికిత్స అందించటంలో వైద్యశిబిరాలకు తరలించడంలో ఆమె అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించారు. వెల్లువలో జిప్ లైన్ పట్టుకుని ప్రాణాలు తెగించి మరీ 35 మంది క్షతగాత్రులను సురక్షిత ప్రాంతానికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ బృందం సభ్యులతోపాటు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించటంలో సాయపడ్డారు. ఆమె సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు కల్పనా చావ్లా అవార్డుకు ఎంపిక చేసింది.



అవార్డులు అందుకున్న ప్రముఖులతో సీఎం స్టాలిన్

వనితకు అవార్డు...

ఇదే విధంగా ముఖ్యమంత్రి పేరిట ఇచ్చే సమర్థవంతమైన నిర్వహణను ప్రశంసిస్తూ ఇచ్చే అవార్డులను ముదల్వరిన్ ముగవరి శాఖ ప్రధాన సాంకేతిక అధికారి టి.వనితకు, పౌర గ్రంథాలయాల శాఖ డైరెక్టర్ కె.ఇలంభగవత్, అవయవాల మార్పిడి సంస్థ మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణన్, రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.దివ్యదర్శిని, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.ఇన్నసెంట్ దివ్యా అవార్డులు స్వీకరించారు. దివ్యాంగులకు సేవలందించినందుకుగాను చెంగల్పట్టు జిల్లా డాక్టర్ జె.విజయలక్ష్మి, చెన్నై జిల్లాకు చెందిన విద్యాసాగర్ సంస్థకు, చెన్నై జిల్లాకు చెందిన సేవకుడు ఎం.నూసై ఆగ్రణి, దివ్యాంగులకు అధిక ఉపాధి అవకాకాశాలు కల్పించిన తూత్తుకుడి జిల్లా సంతానం ప్యాకేజింగ్ సంస్థకు ముఖ్యమంత్రి అవార్డులు ప్రదానం చేశారు. ఇక అత్యుత్తమ జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్‌గా కాంచీపురం జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ అవార్డు అందుకుంది. ఇక సామాజిక సంక్షేమం కోసం పాటుపడినందుకు చెన్నైకి చెందిన సంఘసేవకురాలు మీనా సుబ్రమణ్యన్, మదురైకి చెందిన ఐశ్వర్యం ట్రస్టు, అత్యుత్తమ కార్పొరేషన్‌గా కోయంబత్తూరు, ఉత్తమ మున్సిపాలిటీగా తిరువారూరు, ఉత్తమ నగర పంచాయతీగా కోయంబత్తూరు జిల్లా సూలూరు, అత్యుత్తమ కార్పొరేషన్ జోన్‌గా చెన్నైలోని 14వ జోన్ అవార్డులందుకున్నాయి. ఇదే విధంగా సీఎంకే యువజన అవార్డులను పురుషుల విభాగంలో ఈరోడ్ జిల్లా ఎన్. కదిరవన్, కన్నియాకుమారి జిల్లా జోషన్ రెకోపెర్ట్, కడలూరు జిల్లా సి.జయరాజ్, మహిళల విభాగంలో కడలూరుకు చెందిన ఎస్.నిఖిత, పుదుకోట జిల్లా కవిన్ భారతి, విరుదునగర్‌కు చెందిన ఎస్.ఉమాదేవి, రామనాథపురం జిల్లా కె.ఆయేషా పర్వీన్ అవార్డులు స్వీకరించారు.





కుమరిఅనంతన్‌కు 'తగైసాల్ తమిళర్' అవార్డును ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - కల్పనాచావ్లా అవార్డును స్వీకరిస్తున్న నర్సు సబీనా

గవర్నర్ తేనీటి విందుకు సీఎం స్టాలిన్

● మంత్రులు, వివిధ పార్టీల నేతలూ హాజరు



తేనీటివిందులో గవర్నర్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి

అడయార్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ఇచ్చిన తేనీటి విందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు ఆయన మంత్రివర్గ సహచరులు హాజరయ్యారు. అలాగే, పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు, హైకోర్టు న్యాయమూర్తులు, త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు ఈ తేనీటి విందులో పాల్గొన్నారు. గత యేడాది గవర్నర్ రవి ఇచ్చిన తేనీటి విందుకు సీఎం స్టాలిన్, మంత్రులు హాజరుకాలేదు. దీనికితోడు పలు అంశాలపై ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ యేడాది కూడా ఆయన హాజరుకాకపోవచ్చని అందరూ భావించారు. అయితే, ఈ ఊహాగానాలకు తెరదించుతూ సీఎం స్టాలిన్‌తో పాటు శాసనసభాపతి అప్పావు, రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, తంగం తెన్నరసు, ఏవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం ఉదయనిధి తదితరులు తేనీటి విందులో పాల్గొన్నారు. అదేవిధంగా అన్నాడీఎంకే నుంచి మాజీ మంత్రి డి.జయకుమార్, బెంజిమెన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, హెచ్.రాజా, వీపీ దురైస్వామి, పీఎంకే నుంచి జీకే మణి, డీఎండీకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత, కోశాధికారి సుదీష్, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితర 800 మందికిపైగా పాల్గొన్నారు. అయితే, డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఎండీఎంకే, ముస్లీం మున్నేట్ర కళగం పార్టీలకు చెందిన నేతలు ఈ తేనీటి విందును బహిష్కరించాయి. అంతకు ముందు ఉదయం రాజ్‌భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ ఆర్ఎన్.రవి గిండి గాంధీమండపంలో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా సమరయోధుల వేషాలు వేసిన చిన్నారులను అభినందించారు.



రాజ్‌భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



గిండి గాంధీమండపంలో సమరయోధుల వేషాలు ధరించిన చిన్నారులతో గవర్నర్

పుదువైలో ఘనంగా జెండా పండుగ

● జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సీఎం రంగస్వామి
● ఉత్తమ సేవలందించిన పోలీసులకు పతకాలు

పుదుచ్చేరి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశ 78వ స్వాత్రంత్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి గురువారం జాతీయ జెండా ఎగురవేశారు. పుదువై బీచ్ రోడ్డులో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 9.05 గంటలకు గాంధీ శాలై సమీపంలో జాతీయ పతాకాన్ని సీఎం రంగస్వామి ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత ప్రసంగించిన ఆయన పోలీస్ శాఖలో ఉత్తమ సేవలను అందించిన పోలీసులకు పతకాలు అందజేశారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన వీక్షించారు. అలాగే, కారైక్కాల్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇమ్మిగ్రేషన్ శాఖామంత్రి తిరుమురుగన్, మాహేలో మంత్రి తేని జయకుమార్, యానాంలో జరిగిన వేడుకల్లో లక్ష్మి నారాయణన్ పాల్గొని జాతీయ జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు.



జెండా వందనం చేస్తున్న సీఎం రంగస్వామి

సమాచార ధ్వని

తాంబరం నుంచి అదనంగా 70 బస్సులు

పెరంబూర్, ఆగస్టు 15: తాంబరం రైల్వేస్టేషన్ నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు అదనంగా 70 బస్సులు నడపనున్నారు. తాంబరం యార్డులో మరమ్మతుల కారణంగా ఈ నెల 18వ తేది వరకు సబర్బన్ రైళ్ల రాకపోకల్లో మార్పులు చేశారు. చెన్నై బీచ్ నుంచి తాంబరం వెళ్లే సబర్బన్ రైళ్లు పూర్తిగా రద్దు కాగా, ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్ నుంచి పల్లావరం వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, పల్లావరం బస్టాండ్ నుంచి చెంగల్పట్టుకు అదనంగా 30 బస్సులు, పల్లావరం రైల్వేస్టేషన్ నుంచి గుడువాంజేరికి 20 బస్సులు, తాంబరం బస్టాండ్ నుంచి టి.నగర్, బ్రాడ్‌వే ప్రాంతాలకు అదనంగా 20 బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

కార్పొరేషన్ ఐటీఐలో 82 ఖాళీ సీట్లు

పెరంబూర్, ఆగస్టు 15: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వృత్తి శిక్షణ సంస్థలో 2025-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీ సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సంస్థలో మొత్తం 182 సీట్లుండగా, ప్రస్తుతం 102 సీట్లు భర్తీ అయ్యాయి. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు 'ముత్తయ్యా వీధి, లాయిడ్స్ కాలని, ఐస్ హౌస్, రాయపేట ప్రాంతంలో ఉన్న శిక్షణా కేంద్రాన్ని తగిన సర్టిఫికెట్లు, ఫొటోలతో వెళ్లి అడ్మిషన్ పొందవచ్చు. వివరాలకు 044-28473117, 29515312, 7010457571, 7904935430 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

19న ప్రత్యేక రుణా మేళా

పెరంబూర్, ఆగస్టు 15: తమిళనాడు పారిశ్రామిక పెట్టుబడుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేలా రుణాలు అందజేస్తున్నారు. అన్నాసాలై నందనంలో ఉన్న ఆ కార్పొరేషన్ చెన్నై కార్యాలయంలో ఈ నెల 19 నుంచి సెప్టెంబరు 9వ తేది వరకు ప్రత్యేక రుణ మేళా జరుగనుంది. అర్హత కలిగిన వారికి ప్రభుత్వం అందించే 25 శాతం రాయితీతో కూడిన రుణాలు అందజేస్తారు. ఆసక్తి కలిగిన వారు ఈ మేళాలో పాల్గొని రుణాలు పొందవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 15: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06070 తిరునల్వేలి-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక వారాంతపు రైలు ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 5వ తేది వరకు (గురువారం), నెం.06069 చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 6వ తేది వరకు (శుక్రవారం) పొడిగించారు.
- నెం.06037 చెన్నై ఎగ్మూర్-వేలాంకన్ని ప్రత్యేక రైలు ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 8వ తేది వరకు (శుక్రవారం, ఆదివారం), నెం.06038 వేలాంకన్ని-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 24 నుంచి సెప్టెంబరు 9వ తేది వరకు (శనివారం, సోమవారం) వరకు పొడిగించారు.
- నెం.06051 తాంబరం-రామనాధపురం ప్రత్యేక రైలు ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 14వ తేది వరకు (గురువారం, శనివారం), నెం.06052 రామనాధపురం-తాంబరం ప్రత్యేక రైలు ఈనెల 30 నుంచి సెప్టెంబరు 15వ తేది (శుక్రవారం, ఆదివారం) వరకు పొడిగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 15: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్:గాంధీనగర్, కెనాల్ బ్యాంక్ రోడ్డు, గాంధీ నగర్ 2వ మెయిన్ రోడ్డు, 3వ కెనాల్ క్రాస్ వీధి

మనలి: నెడుంజెలియన్ రోడ్డు, కలైంజర్ నగర్, సీపీసీఎల్ నగర్, పాడ రోడ్డు వీధి కొంత భాగం, వయక్కాడు, 200 అడుగుల రోడ్డు మనలి, సడయాన్ కుప్పం, బర్మా నగర్, ఇరుళర్ కాలని, ఏలందనూరు, పొన్నేరి హై రోడ్డు, రాజీవ్ గాంధీ నగర్, ఎంఎండీఏ 1,2 భవనాలు, ద్వారకా నగర్, ఆండార్‌కుప్పం చెక్ పోస్ట్, ఏసీసీ మెయిన్ రోడ్డు, మెటల్ అండ్ ఇండోటెక్, సాత్తాన్‌కాడు స్టీల్ యార్డ్, కొత్తారి ఫ్యాక్టరీ, రాజాజీ నగర్, కార్గిల్ నగర్, రామస్వామి నగర్, సత్యమూర్తినగర్, వీవీ నగర్, పెరియతోప, చిన్నమాత్తూర్ రోడ్డు, వాషూసీ నగర్, న్యూ టెంపుల్ రోడ్డు, చందన కృష్ణన్ రోడ్డు, విమలాపురం, ఐఏఎల్ ఫ్యాక్టరీ రోడ్డు.

23,24 తేదీల్లో అథ్లెటిక్ పోటీలు

పెరంబూర్, ఆగస్టు 15: తిరువళ్లూర్ జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో 15వ జూనియర్ అథ్లెటిక్ పోటీలు ఈ నెల 23,24 తేదీల్లో జరుగనున్నాయి. 8,10,12,14,16,18,20 ఏళ్ల, ఆపై బడిన వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9566198156 అనే నెంబరుకు ఈ నెల 19వ తేదిలోగా సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

మూడు రోజులు ప్రత్యేక కొండ రైలు

పెరంబూర్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణజయంతిని పురస్కరించుకొని కున్నూరు-ఊటీ మధ్య నడిపే ప్రత్యేక కొండ రైలు సేవలు మరో మూడు రోజులు ఉంటాయని సేలం రైల్వే డివిజన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఈ నెల 16, 17, 25 తేదీల్లో కున్నూర్ నుంచి ఉదయం 8.20 గంటలకు బయల్దేరే రైలు 9.40 గంటలకు ఊటీ చేరుకుంటుంది. అలాగే, ఊటీ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి 5.55 గంటలకు కున్నూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లలో ఫస్ట్ క్లాస్ బోగీలో 80 సీట్లు, సెకండ్ క్లాస్ బోగీలో 130 సీట్లున్నాయి. అలాగే, ఊటీ-గెత్తి-ఊటీ మధ్య మూడు రౌండ్ జాయ్ రైడ్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

జనవరి నుంచి సబర్బన్ రైళ్లకు ఏసీ బోగీలు

పెరంబూర్, ఆగస్టు 15: సబర్బన్ రైళ్లకు ఏసీ బోగీలు అనుసంధానం చేయాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. నగరంలో ప్రజా రవాణాలో సబర్బన్ రైళ్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. చెన్నై నుంచి తాంబరం-చెంగల్పట్టు, తిరువళ్లూర్-అరక్కోణం, గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట మధ్య సబర్బన్ రైళ్లు నడుస్తున్నాయి. చెంగల్పట్టు, సూళ్లూరుపేట, అరక్కోణం వంటి దూరప్రాంతాలకు వెళ్లే సబర్బన్ రైళ్లకు ఏసీ బోగీలు అనుసంధానం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ.ముంబై నగరంలో నడిపే సబర్బన్ రైళ్లకు ఐసిఎఫ్‌లో ఏసీ బోగీలు తయారవుతున్నాయన్నారు. అలాగే, దక్షిణ రైల్వే కోసం 12 ఏసీ బోగీలు తయారీ చేస్తున్నారన్నారు. నవంబరులో ఏసీ బోగీలతో కూడిన సబర్బన్ రైళ్ల ట్రయల్ రన్ నిర్వహించి, వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. తొలివిడతగా చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య నడిచే సబర్బన్ రైళ్లకు ఏసీ బోగీ అనుసంధానం చేయనున్నామని తెలిపారు.

తెలుగు లోగిళ్లలో కోలాహలంగా స్వాతంత్ర్య సంబరాలు

ప్యారీస్, ఆగస్టు 15: భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాజధాని నగరం చెన్నైలోని తెలుగు సంఘాలు, విద్యా సంస్థలు గురువారం కోలాహలంగా జరుపుకున్నాయి. సన్మానాలు, విద్యార్థులకు బహుమతుల పంపిణీ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అసువులు బాసిన సమరయోధుల త్యాగాలు స్మరించుకొని ఘనంగా నివాళులర్పించారు.

మైలాపూర్‌లో...



సంతానకృష్ణన్ పాఠశాల నిర్వాహకులకు సోలార్ సిస్టమ్ అందజేస్తున్న దృశ్యం

మైలాపూర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీఆర్ సంతానకృష్ణన్ పతాకావిష్కరణ చేశారు. పాఠశాల కార్యదర్శి కేవీఎస్ ప్రసాద్, కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు ఏఎస్ గీతాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి ఈ పాఠశాలకు సోలార్ సిస్టమ్ విరాళంగా అందజేశారు.

మద్రాసు మిర్చి వర్తక సంఘంలో...



పంద్రాగస్టు వేడుకల్లో మిర్చి వర్తక సంఘం నిర్వాహకులు

షావుకారుపేట రామకృష్ణ వీధిలోని మద్రాసు మిర్చి వర్తక సంఘంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు ఎస్.శివకుమార్, కార్యదర్శి మూర్తి చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు ఎస్కే. హిమామ్‌భాష, ఉప కార్యదర్శులు వి.ధనుంజయనాయుడు, ఎస్.సెంథిల్‌కుమార్ పర్యవేక్షణలో సలహాదారులు ఎం.మాధవయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకం ఎగురవేసి, సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎస్.బాలసుబ్రమణ్యం, ఎస్.జనార్ధన్, ఎస్.రమేష్, పి.మధుసూదన్, ఎం.చెంబుబాబు, పి.మురళి, ఒ.చంద్రశేఖర్, పి.దశయ్య తదితరులు జెండా వందనం చేశారు.

వలసరవాక్కంలో...



శివశక్తి హోం వార్డన్ రాజేష్‌కు సహాయాలు అందజేస్తున్న గోపాలకృష్ణారెడ్డి బృందం

వలసరవాక్కంలోని శివశక్తి మానసిక, శారీరక దివ్యాంగుల అనాథ శరణాలయంలో చెన్నై తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అభాగ్యులకు రెండు నెలలకు సరిపడే వంట సరుకుల సహా రూ.20 వేల విలువైన సహాయాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు కె.గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శి గాడిపర్తి సురేష్, సభ్యులు శ్రీను బాబు, కొండస్వామి నాయుడు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్‌లో...



పొన్నూరు వెంకటకృష్ణారావును మెమెంటోతో సత్కరిస్తున్న అజంతా శంకరరావు

ప్యారీస్ గిడ్డంగి వీధిలోని సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంలో సంఘ అధ్యక్షుడు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు సారథ్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్కేపీడీ చారిటీస్ మాజీట్రస్టీ డా.పొన్నూరు వెంకటకృష్ణారావు పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. గౌరవ సంయుక్త కార్యదర్శులు మద్దె నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, గౌరవ కోశాధికారి పెసల రమేష్, మద్దాన ప్రవీణ్‌కుమార్, కాశి విశ్వనాథం సహా సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథి కృష్ణారావుకు శాలువ కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు.

టి.నగర్‌లో...



త్రివర్ణ పతాకం ఆవిష్కరిస్తున్న పట్టాభి రామారావు

టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాలలో కార్యవర్గ సభ్యురాలు కె.సుభద్ర దేవి అధ్యక్షతన నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యఅతిథిగా అదనపు కార్యదర్శి పట్టాభి రామారావు పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మద్రాస్ ప్రెసిడెన్సీ స్థాపకులు మాదాల ఆదిశేషయ్య విశిష్ట అతిథిగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఎం.మనోహర్, పీఎం బాబు, టి.రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య, విద్యార్థులు, టీచర్లు పాల్గొని, సమరయోధులకు నివాళులర్పించారు. 2023-24వ సంవత్సరం పబ్లిక్ పరీక్షలో పాఠశాలస్థాయిలో టెన్త్, ప్లస్ టూ తరగతుల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు.

ఎంసీటీబీసీలో...



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పాస్టర్ రాజేంద్ర ప్రసాద్

వెప్పేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ) ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘకాపరి రెవ.డా.ఎస్.రాజేంద్ర ప్రసాద్ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యదర్శి పోతల ప్రభుదాస్, అధ్యక్షులు జి.రామయ్య, కోశాధికారి అనుమలగుర్తి బాబు, సీనియర్ బోధకులు, సంఘ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, మహిళా విభాగం నిర్వాహకులు పాల్గొని జెండా వందనం చేశారు.

చూలైలో....



చూలైలోని మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా డీఆర్‌బీసీసీసీ మేనేజింగ్ ట్రస్టీ ముక్కాల వెంకటకన్నయ్య చెట్టి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవ కరస్పాండెంట్ టీవీ రామకుమార్, ప్రిన్సిపాల్ పి.సుబ్రమణ్యం, ఎస్కేపీడీ ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, సీఆర్ కిషోర్‌బాబు, టీచర్లు పాల్గొన్న ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి సందడి చేశారు.

పుళల్ కావాంగరైలో...



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జీవీ రామకృష్ణ

పుళల్ కావాంగరైలోని తెలుగు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సంఘ అధ్యక్షులు జీవీ రామకృష్ణ జెండాను ఆవిష్కరించి అందరికి మిఠాయిలు పంచిపెట్టారు. గౌరవ అధ్యక్షులు లయన్ జి.మురళి, కార్యదర్శి పి.నరసింహారావు, కోశాధికారి మునుస్వామి, సంఘ సభ్యులు, తెలుగు వారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి అలరించారు.

ఎస్కేపీడీ విద్యాసంస్థల్లో...



స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొన్న బీఎల్ కుమరవేల్, ఎస్కేపీడీ ట్రస్టీలు

జార్జిటౌన్ ఆదియప్పనాయకన్ వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) ప్రాంగణంలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల, కేటీసీటీ మహోన్నత, ప్రాథమిక, ఎస్కేపీడీ బాలుర మహోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు, టీచర్లు పాల్గొని, దేశభక్తి గీతాలు ఆలపించి, సాంస్కృతిక కార్యక్రమాలతో కనువిందు చేశారు. ముఖ్యఅతిథిగా ప్రేమ్ ఫార్మా ఏజెన్సీ పార్టనర్ బీఎల్ కుమరవేల్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు పంపిణీచేశారు. ఎస్కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్ బాబు, టి.బద్రీనాథ్, అడ్వయిజర్ డా.జేవీ రావు, కార్యదర్శి ఎం.కిషోర్ కుమార్, ప్రొఫెసర్లు, టీచర్లు పాల్గొన్నారు.

చెన్నపురి అన్నదాన సమాజంలో...

సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని నైనియప్పన్ నాయకన్ వీధిలో ఉన్న చెన్నపురి అన్నదాన సమాజంలో వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై, వనిత క్లబ్‌ల అధ్యక్షులు చీమకుర్తి మల్లికార్జునరావు-నాగలక్ష్మి దంపతుల అధ్యక్షతన ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యదర్శులు దరిశ త్రిలోక్‌బాబు-పూర్ణిమ, కోశాధికారులు కె.ప్రవీణ్‌కుమార్-శివరంజని దంపతులు, ఎస్వీ పద్మనాభన్, క్లబ్ సభ్యులు విద్యార్థులతో కలసి జెండా వందనం చేశారు.

పెరవళ్లూర్‌లో...



సుబ్రమణ్య భారతీయార్, జవహర్‌లాల్ నెహ్రూ తదితర మహనీయుల వేషధారణలో చిన్నారులు

పెరంబూర్ సమీపంలోని పెరవళ్లూర్‌లో ఉన్న జేఆర్ కామాక్షి మెట్రిక్ ఉన్నత పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టి.రాజేంద్రన్, డైరెక్టర్ హరిప్రియ రాజేంద్రన్ సారథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. స్వాతంత్ర్య సమర యోధులు సుబ్రమణ్య భారతీయార్, పండిత జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ సహా పలువురు మహనీయుల వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు.

అమరజీవి స్మారక మందిరంలో స్వాతంత్ర్య వేడుకలు



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న గుడిమెట్ల చెన్నయ్య

స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక మందిరంలో గురువారం 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అమరజీవి పొట్టిశ్రీరాములు భవన నిర్వాహక కమిటీ చైర్మెన్ కె.అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో కమిటీ సభ్యులు డా.ఎంవీ నారాయణ గుప్తా, జేఎం నాయుడు, డా.ఏవీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

వేలూరు జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవం



వీఐటీలో జెండా వందనం కార్యక్రమంలో ఛాన్సలర్ విశ్వనాథన్ - నరువి ఆస్పత్రిలో జెండా ఎగురవేస్తున్న జీవీ సంపత్ - నేతాజీ స్టేడియంలో త్రివర్ణ పతాకం ఎగురవేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి - తులిరి పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధులు, నేతల మాస్కులు ధరించిన విద్యార్థులు

వేలూరు, ఆగస్టు 15: జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం కోలాహలంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్స్ నిర్వాహకులు జాతీయ జెండా ఎగురవేసి స్వీట్లు పంచుకున్నారు.

వీఐటీ విశ్వవిద్యాలయంలో...

వీఐటీ విశ్వవిద్యాలయంలో జరిగిన వేడుకల్లో వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదరికం లేని భారత్ తీర్చిదిద్దేందుకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాధన్, సహాయ ఉపాధ్యక్షులు కాదంబరి విశ్వనాథన్, వైస్, ప్రొ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్, లెక్చరర్లు, ఉద్యోగులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నరువి ఆస్పత్రిలో....

స్థానిక నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగిన వేడుకల్లో ఆసుపత్రి అధ్యక్షుడు జీవీ సంపత్ జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నిర్వహణ డైరెక్టర్ డా.పాల్‌హెన్రీ, వైద్యసేవల అధ్యక్షుడు డా.అరవిందనాయర్, వైద్య సూపరింటెండెంట్ డా.జాకబ్‌జోస్, ప్రధాని నిధుల అధికారి వెంకటరంగం, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీ స్టేడియంలో...

స్థానిక నేతాజీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ తరఫున 11 మంది లబ్దిదారులకు రూ.19.59 లక్షల విలువైన సంక్షేమ పథకాలు, ఒక రైతుకు రూ.4.25 లక్షల విలువైన ట్రాక్టర్ అందజేశారు. అలాగే, జిల్లా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన 66 మందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ మదివానన్, ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, ఉప మేయర్ సునీల్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, దివ్యాంగుల శాఖ అధికారి శరవణన్, జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ అధికారి రామచంద్రన్, జిల్లా కలెక్టర్ పీఏ (జనరల్) ముత్తయ్యాన్ సహా పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సైన్స్ ఇయక్కం ఆధ్వర్యంలో...

తమిళనాడు సైన్స్ ఇయక్కం ఆధ్వర్యంలో కాట్పాడిలోని తులిర్ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనక అధ్యక్షత వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా తమిళనాడు సైన్స్ ఇయక్కం జిల్లా అధ్యక్షురాలు, లెక్చరర్ అముద పాల్గొని జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా సెక్రటరీ జనార్ధనన్ విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ నేతలతో కూడిన మాస్కులు అందజేశారు. మాజీ జిల్లా ట్రెజరీ అధికారి, సైన్స్ ఇయక్కం సెక్రటరీ నిలువన్, కాట్పాడి రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు లివింగ్‌స్టన్ మీనన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నటరాజ ఆలయ గోపురంపై జాతీయ జెండా

అడయార్, ఆగస్టు 15: కడలూరు జిల్లా చిదంబరంలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నటరాజస్వామి ఆలయం గోపురంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఆగస్టు 15వ తేదీన జరుపుకునే స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఈ ఆలయం గోపురంపై ప్రతి యేటా జాతీయ జెండా ఎగురవేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం 78వ ఇండిపెండెన్స్ వేడుకలను పురస్కరించుకుని కీళ్ సన్నిధి తూర్పు గోపురంపై జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని వెండి తాంబూలంలో ఉంచి శివగామ సుందరి సమేత శ్రీనటరాజ పెరుమాళ్ పాదాల చెంత వుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతీయ పతాకాన్ని ఆలయ కార్యదర్శి వెంకటేశ దీక్షితులు, ప్రధాన దీక్షితులు కలిసి 142 అడుగుల ఎత్తులో ఉండే ఆలయ గోపురంపైకి తీసుకెళ్ళి ఎగురవేశారు.

ఘనంగా ఇమ్మిడి స్నేహం వేడుకలు



ఇమ్మిడి కిషోర్ కుమార్-షర్మిల దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 15: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి-502ఏ రీజియన్ జోన్ 1 ఆధ్వర్యంలో ఇమ్మిడి స్నేహం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నాసాలైలోని ఎస్వీఎస్ క్లబ్ ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షులు పి.బాలాజి-మహాలక్ష్మి, కార్యదర్శులు ఎస్వీ జగదీష్-ఉమా జగదీష్, కోశాధికారులు సూరిశెట్టి భారత్-సుప్రజ దంపతుల సారథ్యం వహించిన ఈ వేడుకల్లో జోన్ ఛైర్‌పర్సన్ ఇమ్మిడి కిషోర్‌కుమార్-షర్మిల దంపతులను ఘనంగా సత్కరించారు. డిస్ట్రిక్ గవర్నర్ రష్మి ఓలేటి, అబ్జర్వర్ ఎస్.బద్రీనారాయణన్, టి.శ్రీనివాసరావు, జీకే మహేంద్రన్, డా.ఎమ్మెస్ చంద్రగుప్తా, శ్రీనివాసరావు, వల్లం గురునాథ్, రాజశేఖర్, కిరణ్‌కుమార్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలురంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను ఘనంగా సత్కరించారు.

నారాయణ పాఠశాలలో పంద్రాగస్టు వేడుకలు



డీజీఎం లక్ష్మీ సంయుక్తకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుమ

పెరంబూర్, ఆగస్టు 15: స్థానిక రామాపురంలో ఉన్న 'నారాయణ పాఠశాల'లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ సుమ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డీజీఎం డా.లక్ష్మీ సంయుక్త హాజరై, జాతీయ పతాకం ఎగురవేసి, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. వేడుకల్లో భాగంగా ఇటీవల జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాలస్థాయిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డీజీఎం లక్ష్మీ సంయుక్త బహుమతి అందజేసి అభినందించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన యోగా, కరాటే, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు రెండు జిల్లాలకు 'ఆరెంజ్' అలర్ట్

పెరంబూర్, ఆగస్టు 15: రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. కేరళ సముద్ర తీరం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో కోయంబత్తూర్ జిల్లాలోని కొండ ప్రాంతాలు, నీలగిరి, తిరుప్పూర్, తేని, దిండుగల్, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి, ఈరోడ్, సేలం, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూర్, వేలూరు, రాణిపేట, నామక్కల్, తిరువణ్ణామలై జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నీలగిరి, కోయంబత్తూర్ జిల్లాల్లో శుక్రవారం భారీవర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రాబోయే 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

వైద్యురాలి వద్ద రూ.37 లక్షల మోసం

పెరంబూర్, ఆగస్టు 15: సీబీఐ అధికారినంటూ వైద్యురాలి వద్ద రూ.37 లక్షల మోసానికి పాల్పడిన అగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కళ్లకుర్చి జిల్లా తిరుకోవిలూర్ ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న వైద్యురాలిని వాట్సాప్ ద్వారా సంప్రదించిన అజ్ఞాతవ్యక్తి, తాను సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. మాదకద్రవ్యాలు తరలిస్తున్నారంటూ మీ మీద ఫిర్యాదు వచ్చిందని, ఈకేసు నుంచి మిమ్మల్ని రక్షించాలంటే ముందుగా రూ.21 లక్షలు పంపాలంటూ బ్యాంక్ అకౌంట్ నెంబరు పంపి బెదిరించారు. అది నమ్మిన వైద్యురాలు తొలిసారిగా రూ.21 లక్షలు, రెండో విడతగా రూ.6 లక్షలు పంపింది. అనంతరం నగదు లేకపోవడంతో బ్యాంక్ నుంచి రుణం తీసుకొని మరో రూ.10లక్షలు పంపింది.అయినా, సదరు వ్యక్తి డబ్బులు పంపాలని బెదిరిస్తుండడంతో ఆమె తన బంధువుకు తెలిపింది. దీంతో వారు కళ్లకుర్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారించిన పోలీసులు, అతను పంపిన బ్యాంక్ ఖాతా ఆధారంగా అతని ఆచూకీ కోసం హైదరాబాద్ వెళ్లారు.

ఏనుగు దంతాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలు

పెరంబూర్, ఆగస్టు 15: ఈరోడ్ జిల్లా సత్యమంగళం నుంచి సేలంకు ఏనుగు దంతాలు తరలిస్తున్న నలుగురు అరెస్ట్ చేసిన అటవీ శాఖ అధికారులు, పరారైన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. మేచ్చేరి కోనూరు అటవీ ప్రాంతం నుంచి మూడు బైక్‌ల్లో వస్తున్న ఆరుగురిని అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. వారిని గమనించి బైక్‌లు ఆపి పరారయ్యేందుకు యత్నించగా నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. వారి నుంచి రెండు ఏనుగు దంతాలు స్వాధీనం చేసుకున్నారు. కొద్దిరోజుల క్రితం ఏనుగును హతమార్చిన ముఠా దాని దంతాలు పెకలించి విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసినట్లు సమాచారం.

ఘనంగా ఏవీటీబీవీఎస్ కార్యవర్గ సమావేశం



కార్యవర్గ సమావేశంలో రవీంద్రన్ చెట్టి, పీజీ ఆర్ముగం తదితరులు

ప్యారీస్, ఆగస్టు 15: స్థానిక పార్క్ టౌన్ కలపాచారి వీధిలోని ఆయిర వైశ్య తెలుగు భేరి వైశ్య సభ (ఏవీటీబీవీఎస్) 69వ వార్షిక కార్యనిర్వాహకుల సమావేశం గురువారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా అన్నాడిశెట్టి అంకమ్మ రత్నం చెట్టి సదనం ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సభ అధ్యక్షులు లయన్ బెల్లపు రవీంద్రన్ చెట్టి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యదర్శి పీజీ ఆర్ముగం, ఉపాధ్యక్షులు చింతు పుల్లయ్య, పొక్కాలి బాలాజీ, ఉపకార్యదర్శులు ఎం.బాబు, ఎం.చెన్నకేశవులు, కోశాధికారి పి.గిరిధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేనంటే డీఎంకే వణుకు: నటి ఖుష్బూ

ప్యారీస్, ఆగస్టు 15: తన పేరు చెబితేనే డీఎంకేకు వణుకు పుడుతోందని సినీ నటి ఖుష్బూ వ్యాఖ్యానించారు. జాతీయ మహిళలు, చిన్నారుల సంరక్షణ కమిషన్ సభ్యురాలి పదవికి రాజీనామా చేసిన సందర్భంగా ఖుష్బూ గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ... తన పేరు వింటేనే డీఎంకే శ్రేణులు గజగజ వణికిపోతాయని వ్యాఖ్యానించారు. ఇక నుంచి రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తానని, బీజేపీ రాష్ట్ర కార్యాలయం కమలాలయంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. తాను ఎవరి ఒత్తిడి వల్ల జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలి పదవికి రాజీనామా చేయలేదని, ఇకనుంచి రాజకీయాల్లో స్వేచ్ఛగా పాల్గొంటానని ఖుష్బూ తెలిపారు.

మెరీనాలో అంబరాన్నంటిన సంబరాలు


వేడుకలకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు


చిన్నారుల ఆనందం

● ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జార్జి కోట వద్ద గురువారం ఉదయం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం 8.40 గంటలకు ముఖ్యమంత్రి స్టాలిన్ రక్షణదళాల భారీ భద్రత నడుమ సెయింట్ జార్జి కోట ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా ఆయనకు స్వాగతం పలికారు. ప్రాంతీయ త్రివిధ సైన్యాధికారులు లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌బీర్ సింగ్ బిరార్, రేర్ అడ్మిరల్ రవికుమార్ ధింగ్రా, ఎయిర్ కమాండర్ రతీష్ కుమార్, కోస్ట్‌గార్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ టోనీ మైఖేల్, డీజీపీ శంకర్‌జివాల్ తదితర పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ ఓపెన్‌టాప్ జీపులో వివిధ పోలీసుల కవాతు తిలకించారు. తొమ్మిది గంటలకు కోట బురుజు పైకి వెళ్ళి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. తరువాత వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను అవార్డులు, పతకాలతో ఆయన ఘనంగా సత్కరించారు. అంతేగాక వేడుకలకు వచ్చిన ప్రత్యేక బాలలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ వేడుకలకు వేలాదిమంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా మార్గాల్లో పూర్తిగా ట్రాఫిక్‌ను మళ్లించారు. వందలాది మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు.




పోలీసుల కవాతును పరిశీలిస్తున్న సీఎం

ఆలయాల్లో సహపంక్తి భోజనం

● హాజరైన మంత్రిగణం


మైలాపూరు మాధవపెరుమాళ్ ఆలయంలో సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అప్పావు, మంత్రి శివ వి మెయ్యనాథన్


ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో నిరుపేదలకు ఉచిత చీరలు, ధోవతులు పంపిణీ చేస్తున్న మంత్రి ఉదయనిధి, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియా తదితరులు


సైదాపేట కార్నీశ్వరర్ ఆలయంలో సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎం. సుబ్రమణ్యం

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం నగరంలోని 32 సుప్రసిద్ధ ఆలయాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో సహపంక్తి భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ట్రిప్లికేన్ శ్రీపార్థసారథి ఆలయంలో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజన కార్యక్రమంలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఉదయనిధి, గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్. ప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉదయనిధి నిరుపేదలకు ఉచిత చీరలు, ధోవతులు పంచిపెట్టారు. మైలాపూరు మాధవపెరుమాళ్ ఆలయంలో సహపంక్తిభోజనంలో స్పీకర్ అప్పావు, మంత్రి మెయ్యనాదన్, అడయార్ అనంత పద్మనాభస్వామి ఆలయంలో మంత్రి కేఎన్ నెహ్రూ, మైలాపూరు కపాలీశ్వరాలయంలో మంత్రి పెరియసామి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే విధంగా తిరువాన్మియూరు మరుదీశ్వరాలయంలో మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, బిసెంట్‌నగర్ మహాలక్ష్మి ఆలయంలో మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, వడపళని ఆండవర్ ఆలయంలో మంత్రి తంగం తెన్నరసు, వేళచ్చేరి తండీశ్వరాలయంలో మంత్రి రఘుపతి, తిరువటీశ్వరన్‌పేట తిరువటీశ్వరాలయంలో మంత్రి ముత్తుసామి సహపంక్తి భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తంబుశెట్టి వీధి కాళికాంబాళ్ ఆలయంలో మంత్రి పెరియకరుప్పన్, తిరువాన్మియూరు పాంబన్ స్వామి ఆలయంలో దామో అన్బరసన్, కోయంబేడు కురుంగాలీశ్వరర్ ఆలయంలో మంత్రి ఎంపీ సామినాథన్, చెన్నై అర్మేనియన్ స్ట్రీట్ కచ్చాలీశ్వరాలయంలో మంత్రి గీతా జీవన్, తిరువొత్తియూరు త్యాగరాజస్వామి ఆలయంలో మంత్రి అనితా రాధాకృష్ణన్, మాంగాడు కామాక్షి అమ్మన్ ఆలయంలో మంత్రి రాజకన్నప్పన్ సహపంక్తి భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చింతాద్రిపేట ఆదిపురీశ్వరర్, ఆదికేశవపెరుమాళ్ ఆలయంలో మంత్రి రామచంద్రన్, పాడి తిరువల్లీశ్వరాలయంలో మంత్రి చక్రపాణి, పూందమల్లి తిరుకచ్చినంబిగళ్ ఆలయంలో మంత్రి గాంధీ, సైదాపేట కార్నీశ్వరర్ ఆలయంలో మంత్రి ఎం. సుబ్రమణ్యం, కేకేనగర్ శక్తివినాయకర్ ఆలయంలో మూర్తి, నుంగంబాక్కం అగస్తీశ్వరాలయంలో మంత్రి ఎస్ ఎస్ శివశంకర్, అమింజికర్రై ఏకాంబరేశ్వరాలయంలో మంత్రి పళనివేల్ త్యాగరాజన్ సహపంక్తి భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాల్లో పంద్రాగస్టు వేడుకలు


సీపీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో నేతలు కె.రామకృష్ణన్, కె.బాలకృష్ణన్ తదితరులు



జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీలో సెల్వ పెరుందగై, పి.చిదంబరం తదితరులు - డీఎండీకే కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ప్రేమలత విజయకాంత్

ప్యారీస్, ఆగస్టు 15: భారత 78వ స్వాతంత్ర్య దిన వేడుకలను నగరంలో గురువారం కోలాహలంగా జరుపుకున్నారు. ప్రజలు తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాలు ఎగురవేసి ఆనందంలో మునిగితేలారు. అలాగే, కాంగ్రెస్, పీఎంకే, సీపీఎం, సీపీఐ, డీఎండీకే, టీఎంసీ, బీజేపీ కార్యాలయాల్లో పండుగ సందడి నెలకొంది.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

స్థానిక రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. అనంతరం అన్నాసాలైలోని దర్గా నుంచి 100 అడుగుల పొడవు కలిగిన భారీ జెండాతో ఊరేగింపు నిర్వహించారు. పార్టీ సీనియర్లు కృష్ణస్వామి, పి.చిదంబరం సహా యువజన, మహిళ, విద్యార్థి, సేవాదళ్ తదితర అనుబంధ విభాగాల నిర్వాహకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో....

తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో ఆ పార్టీ ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతి జాతీయ జెండా ఎగురవేశారు. ఇందులో పార్టీ నిర్వాహకులు ఆస్టిన్, పూచ్చి మురుగన్, ఖాజా, జిల్లా కార్యదర్శి చిట్రరసు సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

టి.నగర్ వైద్యరామన్ వీధిలో ఉన్న సీపీఎం ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో కేంద్ర కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.బాలకృష్ణన్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొని జెండా వందనం చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో....

టి.నగర్ బోగ్ రోడ్డులోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పార్టీ సీనియర్ నేత ఆర్.నల్లకన్ను త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, సీహెచ్ వెంకటాచలం, వీరపాండ్యన్ సహా పలువురు పాల్గొన్నారు.

టీఎంసీ ఆధ్వర్యంలో....

ఆళ్వార్‌పేటలోని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ జాతీయ జెండా ఎగురవేశారు. వీటీ జవహర్ బాబు, జీఆర్ వెంకటేష్, తిరువేంగడం, ఈకే అరుణ్‌కుమార్, బిజు చాకో, మాజీ కౌన్సిలర్ రాణి కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

టి.నగర్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం కమలాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై జెండా ఎగురవేశారు. పార్టీ రాష్ట్ర నిర్వాహకులు అరవింద్ మీనన్, హెచ్.రాజా, సినీ నటి ఖుష్బూ, చక్రవర్తి, కరాటే త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ జెండాలతో మోటారు సైకిల్ ర్యాలీలో బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డీఎండీకే ఆధ్వర్యంలో...

కోయంబేడులో డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, పార్టీ కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఉప కార్యదర్శులు ఎల్కే సుధీష్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో....

టి.నగర్‌లోని అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డా.సునీల్ కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కె.సూర్యకళ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్, పెన్సిల్, జామెంట్రీ బాక్సులు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తేన్‌మొళి, చిన్నయ్య, సురేష్‌కుమార్, కరాటే శేఖర్, జయరామన్, విజయ్ నటరాజ్, ముస్తఫా, విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.


ఆళ్వార్‌పేటలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్


కమలాలయంలో జెండా వందనం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై


టి.నగర్ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు


వివిధ ఆకృతుల్లో గాలిపటాలు

కోలాహలంగా 'ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్'

పెరంబూర్, ఆగస్టు 15: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపం తిరువిడందై బీచ్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ వేడుకలను మంత్రులు రామచంద్రన్, టీఎం అన్బరసన్ ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక శాఖ, గ్లోబల్ మీడియా బాక్స్ సంయుక్త ఆధ్వర్యంలో మూడో సారి జరిగిన ఈ ఫెస్టివల్ గురువారం నుంచి నాలుగు రోజులు జరుగనుంది. ఇందులో మలేసియా, జర్మనీ, థాయ్‌ల్యాండ్, స్విట్జర్లాండ్, వియత్నాం సహా పలు దేశాలకు చెందిన సంస్థలు పాల్గొన్నాయి. దేశంలో పలు నగరాలకు చెందిన 200 మంది 10 టీములుగా విడిపోయి ఈ క్రీడల్లో పాల్గొంటున్నాయి. గత ఏడాది వివిధ భారీ ఆకృతుల్లో సుమారు 150 గాలిపటాలు ఎగురవేయగా, ఈ ఏడాది వాటి సంఖ్య 300 వరకు పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ముువ్వన్నెల రెపరెపలు

● ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు


చెన్నైలోని ఇండియన్ ఆయిల్ భవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో దక్షిణ ప్రాంతీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సుధాకర్. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.అన్నాదురై తదితరులు


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్, ఆర్పీఎఫ్ ఐజీ ఈశ్వరరావు


ఐసిఎఫ్‌లో జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో ప్రసంగిస్తున్న జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు

అడయార్, ఆగస్టు 15: భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వీట్లు, మిఠాయిలను పంచిపెట్టారు. చెన్నై నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయమైన రిప్పన్ భవనంలో జరిగిన వేడుకల్లో నగర మేయర్ ఆర్.ప్రియ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. మెరీనా తీరంలోని కామరాజర్ శాలైలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ శంకర్ జీవాల్ జెండాను ఎగురవేశారు. ఇందులో ఏడీజీపీ డేవిడ్సన్‌తో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వెప్పేరిలోని చెన్నై నగర పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్ అరుణ్ ముువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఇందులో జాయింట్, డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పార్క్‌టౌన్‌లోని సదరన్ రైల్వే ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ జాతీయ పతాకాన్ని ఎగురవేయగా దక్షిణ రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్యారీస్‌లోని మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలో జరిగిన ఇండిపెండెన్స్ డే వేడుకల్లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, హైకోర్టులో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, పోలీసులకు, భద్రతా సిబ్బందికి ప్రశంసా పత్రాలు, పతకాలను ప్రదానం చేశారు. ఆ తర్వాత వయనాడు బాధితుల కోసం హైకోర్టు న్యాయమూర్తులంతా కలిసి రూ.2.19 లక్షల విరాళాన్ని అందజేశారు. చెన్నై హార్బరు, ఎన్నూరులోకి కామరాజర్ హార్బరులో 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా అన్నాసాలైలో ఉన్న ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం, ప్యారీస్, నుంగంబాక్కంలలో ఉన్న ఆదాయపన్ను శాఖ కార్యాలయం, నుంగంబాక్కంలోని కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయ భవనమైన శాస్త్రిభవన్‌లో జాతీయ జెండా ఎగురవేశారు. అదేవిధంగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు.


రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.విజయకార్తికేయన్


పోరూరు శ్రీరామచంద్ర విశ్వవిద్యాలయంలో జెండావందనం చేస్తున్న వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్


చెన్నై డీఎంఎస్ కార్యాలయం వద్ద జాతీయ జెండా వందనం చేస్తున్న లేబర్ కమిషనర్ అతుల్ ఆనంద్



చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న మేయర్ ప్రియ


సీఎండీఏ ప్రధాన కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఆ సంస్థ మెంబర్ సెక్రటరీ అన్షుల్ మిశ్రా



తిరువళ్లూరు జిల్లా క్రీడాప్రాంగణంలో స్వాతంత్ర్యదిన వేడుకల్లో జాతీయపతాకాన్ని ఎగురవేసి, పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ టి.ప్రభుశంకర్


చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వాస్పత్రి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తేరాణి రాజన్ స్వాతంత్ర్యదిన వేడుకలను పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఎగురవేసి, సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం



ఎన్ఎల్‌సీలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో జెండావందనం చేస్తున్న ఎన్ఎల్‌సీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి


చెన్నైలో జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో ఇండియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎల్ జైన్ తదితరులు


వీఐటీ-చెన్నై ప్రాంగణంలో గురువారం జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న వర్సిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శేఖర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎఫ్ఎం ఇబ్రహీం ఖలీఫుల్లా తదితరులు